# "పునరుత్థానమును నేనే"

# (11:1-44)

దాన్ని యిర్మీయా ఎలా చేశాడో నాకు తెలియదు! ప్రకటించడానికి పాత నిబంధన ప్రవక్త లేచి నిలిచిన దాదాపు ప్రతిసారి, కూడిక చిన్నదిగా అయ్యేది. అక్కడ జీవించిన కాలాన్ని బట్టి, అతడు ప్రకటించడానికి పిలువబడిన సత్యం చెడు వార్తగా భావించబడింది. ఇశ్రాయేలీయులు దుష్టత్వంలోనికి దిగజారిపోయారు. దేవుడు వారిని బబులోను చెరసాలకు పంప నిశ్చయించుకున్నాడు. వారికి యిర్మీయా యొక్క వర్తమానం "తమ ఔషధం తీసికోమని," నెమ్మదిగా వారి తీర్పును అంగీకరించుమని. దానికి ఫలితంగా, ప్రజలు అతనిని ద్వేషించి అతడు చస్తే బాగుండునని కోరుకున్నారు.

## చెడ్డ సందేశం

యోహాను 11నుండి ఈ పఠన ప్రారంభం సువార్తికుని కొంతవరకు యిర్మీయాలా భావించేటట్లు చేస్తుంది. ఈ లేఖన భాగం కొంత ఆశ్చర్యకరమైన సువార్తను కలిగియుండగా, మనం ఇష్టపడనిదాన్ని ఎదుర్కొనడానికి మొదట సిద్ధంగా ఉండాలి. బాధాకరమైన సందేశమేమంటే మనమందరం చనిపోతాం! జీవితం మృత్యువాత పడుతుంది! ఈ సమయంలో మనం ఎంత చిన్నగా, బలంగా, ఆరోగ్యంగా ఉన్నప్పటికిని, ఏదో ఒక రోజు మనం చస్తాం! అది నేడే కావచ్చు లేదా రేపే కావచ్చు లేక యిక్కడనుండి యింకా ఎనభై సంవత్సరాల తరువాతనే కావచ్చు – అయితే మనమందరం చనిపోతాం.

ఈలాటి భయంకరమైన సత్యాన్ని ఎదుర్కొనకుండ తప్పించుకొనడానికి మనం అనేక విధాలుగా ప్రయత్నించవచ్చు. తగినంత వ్యాయామం చేసి, సరియైన భోజనాన్ని తింటే, శుభ్రమైన నీటిని త్రాగితే, ఎండ ఎక్కువగా తగులకుండ కాపాడుకుంటే, అప్పుడు మనం మరణంనుండి కాపాడబడతామని మనలను మనమే ఒప్పించుకొన చూస్తాం. చివరికి, లోకంలో మృతుల లెక్క నూటికి నూరు శాతమనే వాస్తవంనుండి తప్పించేది ఏదీ లేదని తేలిపోయింది!

"నేను దానిని ఈ రోజు వినడానికి యిష్టపడనని నీవు ఆలోచిస్తూ ఉండవచ్చు! నాకు ఒక కష్టమైన వారం గడిచిపోయింది, మరి యిప్పుడు నేను చస్తానని స్మరింప బడ్డాను!" సువార్త దీనికి పరిష్కారం ప్రసాదించక పోయినట్టయితే ఈలాటి బాధాకరమైన అంశాన్ని నేను లేవనెత్తేవాడనే కాదు. యోహాను 11లోని ఆశ్చర్యకరమైన కథలో ప్రభువైన యేసు, "పునరుత్థానమును జీవమును నేనే"యని సర్వ మానవ కోటికి ప్రకటించాడు.

అది అద్భుతమైన సందేశం. అయితే మనం దాన్ని ప్రశంసించాలంటే మొదటిగా మనం చెడ్డ సమాచారాన్ని గూర్చి జ్ఞాపకం చేసుకోవాలి.

యొర్దాను నదిని దాటి బాప్తిస్మమిచ్చు యోహాను తన పరిచర్య జరిగించిన ప్రాంతానికి యేసును ఆయన శిష్యులును యూదయలోని సంఘర్షణను తప్పించుకొని తరలివచ్చారు (10:40). బేతనియవాడైన లాజరు రోగియైయున్నట్టు ఒక రోజున వర్తమానం వచ్చింది (11:1). లాజరు, మరియ, మార్తలు ప్రభువైన యేసునకు ప్రియమైన స్నేహితులై ఉన్నందున, ఆయన వెంటనే బేతనియకు వెళ్లతాడని ప్రతి ఒక్కరు ఊహించుకొని ఉండవచ్చు. ఏదియెలాగున్నా, తన ఒక్కనికే తెలిసిన కారణాలను బట్టి యేసు తానున్న చోటనే యింకా రెండు దినాలు గడిపాడు. చివరిగా, లాజరు చనిపోయాడని ఎరిగి, రోగియై పడియున్న తన స్నేహితుని చూడ వెళ్ల సమయం వచ్చిందని తన శిష్యులతో చెప్పాడు. మొదట వారు ఆ ఆలోచనకు ఆక్షేపణను తెలిపారు. ఎందుకంటే వారు తిరిగి యెరూషలేము ప్రాంతంలో కన్పించినట్టయితే హింస మరియు మరణం కూడా వారందరి కొరకు కాచుకొని ఉంటుందని వారు ఎరిగియున్నారు. మరియు బేతనియ అక్కడనుండి కేవలం రెండు మైళ్లు మాత్రమే ఉంటుంది (11:18). ఏదియెలాగున్నా, లాజరు చనిపోయిన సంగతి వారికి తెలిపినప్పుడు – వెళ్లడానికి వారు అయిష్టతతోనే అంగీకరించారు – మరీ తోమా అయితే, "ఆయనతో కూడ చనిపోవుటకు" మనమును వెళ్లుదమని చెప్పాడు (11:16).

యేసు ఆ గ్రామానికి సమీపించుతుండగా, ఆయన గ్రామంలోనికి యింకా ప్రవేశింపక ముందే (11:30), ఆయన వస్తున్నట్టు విని మార్త పరుగెత్తుకొని ఎదురుగా వచ్చింది. "ప్రభువా, నీవిక్కడ ఉండినయెడల నా సహోదరుడు చావకుండును" అని ఆయనతో చెప్పింది (11:21). మరణం ఎదుట తన నిస్సహాయ భావనతో మానవ జాతి అంతా మరణంపట్ల ఆమెకుగల నిస్సహాయ భావనతో సంబంధం జోడించుకోవచ్చు. అణగారే మరణపు శక్తినుండి ఎంత శ్రేష్ఠమైనా మన ప్రయాసలేవీ పనికిరావని అంత్యక్రియల కార్యక్రమాలు మనకు ఒక విధంగా జ్ఞప్తి చేస్తూ ఉంటాయి.

మార్త యొక్క మాటలకు బదులుగా, "నీ సహోదరుడు మరల లేచునని ఆమెతో ప్రభువు చెప్పాడు" (11:23). ఆ మాటలు ఆమెకు ఎలా తోచాయో మనకు తెలుసుకునే మార్గం లేదు. అది బాధాకరంగా ఉందా? శవమున్న యింటివద్ద కొన్ని సార్లు వినబడే ఉత్త డొల్లు మాటలుగా అవి వినిపించాయా? ఆమె విశ్వాస లేమికి గద్దింపుగా వినిపించాయా? ప్రభువు పలుకులకు ఆమె యొక్క తొలి ప్రతిచర్య ఏమైయున్నా, ఆ మాటలను మార్త ఆత్మ సంబంధమైనవిగా మలచి, "–అంత్యదినమున పునరుత్థానమందు లేచునని యెరుగుదునని" ఉత్తరమిచ్చింది (11:24).

## సుసందేశం

ఈ ఏర్పాటులో తన పరిచర్య అంతటిలో లోకాన్ని మార్చే బహు ఘనమైన విషయాలను ప్రభువైన యేసు పలికాడు. మార్త మాటలకు ప్రత్యుత్తరంగా "యేసు –

పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" (11:25, 26ఎ). ఈ సమయంలో ప్రభువు ఏమి చెప్పలేదో గమనించడం చాలా ప్రాముఖ్యం. "నేను లాజరును లేపుతాను" అని ఆయన అనలేదు. "పునరుత్థానాన్ని నేను అనుభవిస్తానని" ఆయన అనలేదు. "పునరుత్థానమును జీవమును నేనే" అన్నప్పుడు ఆయన వీటన్నిటిని మించిన భావాన్ని ప్రకటించాడు. ఇక్కడ "నేనే" అనే మరొక దానిని మనం ఎదుర్కొంటాం. యోహాను సువార్తలో దేవత్వానికి ప్రభువు మరొక క్లెయిమ్ చేస్తూ, గొప్ప శత్రువుగా ఉన్న మరణంతో తనకున్న సంబంధాన్ని కూడా తెలియజేస్తున్నాడు.

తాను పునరుత్థానమైయున్నట్టు ప్రకటించుకొనడంవలన తన అనుచరులు భౌతిక మరణాన్ని అనుభవించరని గాని, తాను ఎన్నడూ మరణాన్ని ఎదుర్కోబోవడం లేదని గాని ఆయన తెలుపలేదు. ఆయన మృతినొంది తిరిగి బ్రదుకుతాడు గనుక, మరణం యొక్క శక్తిని ఆయన లొంగదీస్తాడని, తన్ను అనుసరించేవారు మరణంతో వేరైన సంబంధం కలిగియుంటారని ఆయన తెలియజేశాడు. పునరుత్థానమనేది వారికి అద్భుతమైన, ఒక్కసారిగా జరిగే సంఘటన; అది జీవితానికి కొత్త వాస్తవమైయుంది!

మార్త పలికిన తరువాత మాటలలో మహా ఘనమైన విశ్వాసమును, ఆత్మ సంబంధమైన విషయాలలో లోతైన గ్రహింపును వ్యక్తపరచబడ్డాయి. ఈ మాట నమ్ము చున్నావా? అని ఆయన ఆమెనడిగినప్పుడు, "ఆమె – అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నానని ఆయనతో చెప్పెను" (11:27). జరుగబోయే మహా గొప్ప అద్భుతం జరుగక ముందే, ఏ విశ్వాసాన్ని కలిగించాలని యోహాను సువార్త వ్రాయబడిందో, ఆ విశ్వాసాన్ని మార్త ప్రదర్శించింది.[1]

మార్త ప్రభువును దర్శించిన తరువాత, తన యింటికి వెళ్లి ప్రభువు వచ్చిన సంగతిని గూర్చి తన సోదరితో చెప్పింది. ప్రభువు సమీపంలోనే ఉన్నాడన్న వార్త విన్నతోడనే మరియ ఆయనను కలిసికొనడానికి త్వరగా వెళ్లింది. ఆమె యేసును కలిసికొన్నప్పుడు, ఆయన పాదములమీద పడి, బాధాకరమైన తన సోదరి మాటలనే ఆమె తిరిగి వల్లించింది: "–ప్రభువా, నీవిక్కడ ఉండినయెడల నా సహోదరుడు చావకుండు ననెను" (11:32). మరియ ఆ సమయంలో అనుభవించిన బాధ, వేదన, దుఃఖము, కలత మనమందరం అనుభ వించినవారమే. తత్ ఫలితంగా, మనమందరం లాజరు యొక్క సమాధి వద్దకు వెళ్లడానికి సంసిద్ధంగా ఉన్నాం.

ఆ దినమున ఆయన చూచిన దానంతటిని బట్టి, ప్రభువు "కలవరపడి ఆత్మలో మూలుగుచు" (11:33), లాజరు ఎక్కడ పాతిపెట్టబడ్డాడో అడిగాడు. వారు సమాధి వద్దకు వెళ్లుచుండగా, సానుభూతిపరులతో కలసి, అందరికీ కనిపించేలా ఏడ్చాడు (11:35). దానిని కాంచినవారు, ఆయన "అతనిని ఏలాగు ప్రేమించెనో చూడుడని" చెప్పుకున్నారు (11:36)!

లాజరు సమాధి నిజానికి ఒక గుహ, దాని ద్వారము పెద్ద రాతిచేత కప్పబడింది (11:38). ఆ రాతిని పొర్లించుడని యేసు చెప్పినప్పుడు, లాజరు పాతిపెట్టబడి అప్పటికి నాలుగు దినములైనట్టున్నూ, కుళ్లిపోయిన అతని మృత దేహం కంపుకొట్టుతుందన్నట్టున్నూ

మార్త ఆక్షేపణ తెలిపింది. తనయందు నమ్మిక యుంచుమని చెప్పి, రాతిని తీసివేయించాడు (11:39-41).

యోహాను సువార్తలో దాఖలు చేయబడిన "సూచక క్రియ"లన్నింటిలో, లాజరు సమాధి వద్ద జరిగినంత ఎక్కువగా మరెక్కడా జరుగలేదు. "దేవుని మహిమను" ప్రజలు చూచునట్టు ఈ సంభవాలు జరిగాయని 11వ అధ్యాయంలో ప్రభువు ముమ్మారు చెప్పుకున్నాడు (11:4, 15, 40). యేసు బోధలోనూ, అద్భుతాలలోను దేవుని మహిమను మనం ప్రతి మెట్టులోను చూచాం. యోహాను సువార్తలోని ఈ సన్నివేశంవరకు, దేవుని మహిమ క్రీస్తునందు ప్రత్యక్షపరచబడుతుంది. అయితే లాజరు సమాధి వద్ద అది అతి ప్రకాశమానంగా ప్రజ్వరిల్లింది. కాంతివంతంగాను, కాంతిహీనంగాను చేసికోగల దీపం చేతిలో ఉన్నట్టు యోహాను సువార్త పఠనం ఉంటుంది. యోహానులో మనం ముందుకు సాగేకొలది, వెలుగు ప్రకాశమానంగా ఉంటుంది. 11వ అధ్యాయానికి మనం చేరు కున్నప్పుడు, వెలుగు దాదాపుగా గుడ్డితనం కలిగించేంతగా మారిపోయింది. అనేక విధాలుగా దేవుని మహిమను మనం యింతకు ముందే చూచాం; రాబోయే కొన్ని వచనాలలో బహు శక్తివంతంగా దాన్ని వీక్షిస్తాం.

దిగ్భ్రాంతి చెందిన విలాపకులు లాజరు సమాధి వెలుపల నిలువబడి, సమాధిపైనున్న రాయి దాని ముఖ ద్వారంనుండి తీయబడగా గమనించుతూ, యేసు ఆకాశమువైపు కన్నులెత్తి ప్రార్థించుటను చూచారు (11:41, 42). ఆయన తన ప్రార్థన ముగించిన తోడనే, "-లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా" చెప్పాడు (11:43). గుహ ద్వారాన్ని ప్రతి ఒక్కరు తిలకిస్తూ ఉండగా, బహు గంభీరమైన నిశ్శబ్దము తాండవించి యుండవచ్చు. ఏమీ సంభవించక పోయినట్టయితే, ఒక పిచ్చివాడి సమక్షంలో వారందరు పోగైనట్టు వారు ఎరిగియుంటారు. అయితే, నిజంగా లాజరు ఆ గుహలోనుండి వెలుపలికి వచ్చాడే అనుకో, ఎన్నడు ఎవడును కలిగియుండని మహత్తరమైన శక్తి కలిగియున్న వాని సముఖంలో వారు నిలిచియున్నారనడానికి ఏలాటి సందేహమూ ఉండదు.

లాజరు "చనిపోయినవాడు" (11:44), కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడిన వాడై వెలుపలికి వచ్చాడు. "మీరు అతని కట్లు విప్పి పోనియ్యుడని" అక్కడ నిలిచియున్న వారితో ప్రభువు చెప్పాడు (11:44). లాజరు బ్రతికింపబడ్డాడు. తన్ను గూర్చి యేసు తానేమి చెప్పుకున్నాడో అదంతా తిరిగి ప్రదర్శింపబడింది, దేవుని మహిమ దేదీప్యమానంగా ప్రకాశించింది! కాబట్టి, ఫలితం ఎదురు చూడబడినట్టే, "ఆయన చేసిన కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి" (11:45).

## సుసందేశము, మనము

మరణ విషయంలో మన స్వంత భయాందోళనను ఎదుర్కొనడానికి లాజరు సమాధి వద్ద యేసు యొక్క కథ మనకు సహాయపడుతుంది. ఆనాడు క్రీస్తు ఏమి జరిగించాడో, నేడును అదే చేయగలవాడైయున్నందున, ఈ జీవిత కాలంలో ఆనందంగా ఉండడానికి మరణం యొక్క వాస్తవాన్ని మనం లేదు - కాదు అననక్కరలేదు. క్రైస్తవులంగా మనం

మరణంనుండి పరుగెత్తం, మనం దాన్ని ఎదుర్కొంటాం. అది మనకు రాదని మనం నటన చేయం. అయితే దానికి మన వద్ద జవాబుందని మనం లోకానికి ఎలుగెత్తి చాటుతాం. ఈ నూతన స్వభావమునకు పౌలు రచనల్లోని రెండు ఉదాహరణలను ఈ క్రింద చూద్దాం:

> **మరణమైనను** జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను (రోమా 8:38, 39; ఒత్తి పలకడం నాది).

> ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, – **"విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ?"** (1 కొరింథీ. 15:54, 55; ఒత్తి పలకడం నాది).

మరణము జీవితపు వాస్తవమైయుంది. మరణానికి జవాబు క్రైస్తవ్యానికి ఉన్నందున మనం కృతజ్ఞత కలిగియుందాం. ప్రభువైన యేసు పునరుత్థానమును జీవమునైయున్నట్టి జ్ఞానము "నిజ లోకంలో" సంతోషము సమాధానాలు కలిగియుండేలా మనలను చేస్తుంది. మరణం యొక్క భయాలను మొదట ఎదుర్కొనడంవలననే ఈ జీవిత కాలంలో నిజమైన సంతోషాన్ని మనం పొందగలం.

జీవము, మరణము అనే గొప్ప వాస్తవాలను (సమస్యలను) గూర్చి తన మనస్సు, ఆత్మలను క్రమశిక్షణలో ఉంచుకొనడానికి గాను పదిహేడవ శతాబ్దపు కవియు సువార్తికుడునైన జాన్ డొనే అనే వ్యక్తి సమాధి పెట్టిలో కొంత సమయం నిదురించగోరాడు. కొన్ని సంవత్సరాల క్రిందట నాకు కూడా అలాటి అనుభవమే కలిగింది. నా కార్యాలయం చుట్టు సందడి, గోల నిరంతరం ఉంటున్న కారణాన చదవడానికి గాని, ప్రార్థించడానికి గాని తగిన సమయం కనుగొనడం కష్టమయ్యింది. స్థానికంగా సమాధి పెట్టెలు చేసే నా స్నేహితునికి నా సమస్య తెలియజేశాను. నా సమస్యకు తానొక పరిష్కారం కనుగొన్నట్టు కొద్ది కాలం తరువాత అతడు నాకు తెలిపాడు. సమాధి పెట్టెలు చేసే రెండవ అంతస్థులోని ఒక గదిలోనికి నన్ను తోడ్కొనిపోయి నా కొరకు అతడు నిర్మించిన ఒక చిన్న అమరికను చూపించినప్పుడు నేనెలా ఆశ్చర్యపోయానో నీవు ఊహించవచ్చు. సమాధుల పెట్టెలు చేసే అతని గోడౌనులో వెనుకతట్టు ఒక మూలలో ఈ ఏర్పాటు చేశాడు! నాకు యివ్వబడిన గొప్ప బహుమానాలన్నిటిలో అది ఒకటి. పట్టణపు రద్దీనుండి వెళ్లి నేను పఠించడానికి, ఆలోచించడానికి, ప్రార్థించడానికి అది నాకు అనుకూలమైన స్థలంగా మారిపోయింది (సమాధుల పెట్టెలు చేసే గోడౌనులోనికి వచ్చి ఎవరూ ఆటంకపరచరనుకో). అప్పటినుండి, సమాధుల గదిలో ప్రసంగాలన్నీ వ్రాయాలి కాబోలు అని నాకు ఆలోచన వచ్చింది, జీవితపు అతి కష్టమైన వాస్తవపు నీడలో అది జరుగుతుంది. (మృత దేహాన్ని) సుగంధ ద్రవ్యాలతో సిద్ధపరచే గదిని దాటి, శవపేటికలతో నిండిన దానిగుండా నడిచి పోయేటప్పుడు, సుఖ జీవనం జీవించేలా ప్రజలకు సహాయపడడం కంటె, నిజమైన

జీవితాన్ని కనుగొనేలా జనులకు సహాయం చేయుట నా లక్ష్యంగా జ్ఞప్తి చేయబడతాను. వారి హృదయాల్లో ఉండే సమస్త దుఃఖాన్ని తొలగించాలని కాదు; వేదనను దాటి పునరుత్థానం వైపుకు తలంపులను మళ్లించగోరతాను. లోకం యొక్క ఒత్తిడులు బాధలు ఎదుర్కొనేలా సహాయపడడం కాదు; వారు దేవుని కలిసికొనేలా వారిని సిద్ధపరచడమే (ఆమోసు 4:12).

## ముగింపు

ఉత్కంఠ కలిగించే స్థితిలో నిలిపే ఒక పుస్తకాన్ని చదివావా? లేక ఆలాటి ఒక ప్రదర్శనను చూచి భయపడ్డావా? నీవు తిరిగి ఆ పుస్తకాన్ని చదివావా? లేక ఆ ప్రదర్శనను చూచావా? దానికి రెండవ సారి మీ ప్రత్యుత్తరమేమి? నేను రెండవ సారి అలా చేసినట్టయితే నేను తీరికగా మరో కోణంలో చూస్తాను. అంతా సజావుగానే అంతమౌతుందని నిశ్చయంగా ఉంటాను.

బేతనియకు సమీపమున ఉన్న గుహలోనుండి లాజరు బయటికి వచ్చినప్పుడు, మన కథలు ఎలా అంతమౌతాయో అతడు ప్రదర్శించాడు. ప్రభువు త్వరలో ప్రత్యక్షం కాకపోతే, మనమందరం మరణాన్ని ఎదుర్కొంటాం. ఏదియెలాగున్నా, ప్రభువైన యేసు పునరుత్థానమును జీవమునై ఉన్నందున, మరణాన్ని మనం విభిన్నంగా చూస్తాం. మన దేహాలు ఏదో ఒక రోజున సమాధులలో పెట్టబడినా, మనం ఆ సమాధులలోనుండి లేపబడతామనేది నిశ్చయం! మరణమనే సమస్యకు ప్రభువు జవాబైయున్నాడని మనం నమ్మినప్పుడు మాత్రమే, మనం నిజంగా జీవింప సిద్ధపడినవారమై ఉంటాం!

---

సూచన

[1]మార్త యొక్క ఒప్పుకోలుకు ప్రక్క గమనికగా, లియోన్ మోరిస్ యిలా అన్నాడు. సుప్రసిద్ధమైన తన ఒప్పుకోలుకంటెను మార్త అనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందర పడడం ఎంత దురదృష్టకరం (లూకా 10:41).